నిబంధనల అతిక్రమణ

- కనుమరుగవుతున్న కాలువలు, చెరువులు
- బాన్సువాడ మున్సిపల్ పరిధిలో యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు



నిజాంసాగర్ డి-10 కాలువ పక్కనే ప్లాట్లు చేసేందుకు రియల్టర్లు పాతిన హద్దులు

బాన్సువాడ టౌన్: బాన్సువాడ మున్సిపాలిటీలో ఆక్రమణల పర్వం జోరుగా కొనసాగుతుంది. ఎన్ని చట్టాలు తెచ్చినా కబ్జాలు ఆగడం లేదు. సెట్‌బ్యాక్, బఫర్ జోన్‌ల నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. బహుళ అంతస్తుల నిర్మాణం, వెంచర్ల పేరుతో ఆక్రమణలు సాగుతుండటంతో పట్టణ వాసులు సతమతమవుతున్నారు. అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడంతో అధికారులు తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ కేంద్రాల్లో చెరువులు, కాలువలు క్రమంగా కనుమరుగవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. సహజంగా పారే సెలయేర్లు, ఒర్రె లు, కాలగర్భంలో కలిసిపోగా నిజాంసాగర్ ఉప కాలువలు సైతం ఆక్రమణలకు గురయ్యాయి. చెరువుల శిఖం, నిజాంసాగర్ ఉప కాలువల పక్కనే నిర్మాణాలు చేపట్టినా టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నిజాంసాగర్ డి-10 కాలువ ఇప్పటికే ఆక్రమణలకు గురి కాగా కల్కి చెరువు ఉప కాలువలు సైతం కబ్జాకు గురయ్యాయి. ఎల్లయ్య చెరువు శిఖంలో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. చెరువుల పరిమాణం సగానికి పైగా తగ్గిపోయాయి.

రాజకీయ ఒత్తిళ్లతో..

జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో నిర్మాణాలు విస్తరిస్తున్నాయి. అనుమతులు లేకుండా నిత్యం కొత్త నిర్మాణాలు వెలుస్తున్నాయి. డ్రైనేజీలు, రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు, లే అవుట్‌లు చేపడుతున్నారు. ముందుగానే అక్రమ నిర్మాణాలను గుర్తించి సమస్యను పరిష్కరించాల్సిన ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య జఠిలమవుతోంది. అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్టిన అనంతరం తొలగించేందుకు రాజకీయ ఒత్తిళ్లతో అధికారులకు తలనొప్పిగా మారింది. అలాగే కాలువలను ఆక్రమించడంతో చివరి ఆయకట్టుకు సాగు నీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

సెట్‌బ్యాక్ ఉండాలి

చెరువుల కింద ఉన్న చిన్న కాలువ పక్కన ఆరున్నర ఫీట్లు సెట్ బ్యాక్ ఉండాలి. నిజాంసాగర్ ఉప కాలువ పక్కన కనీసం 30 ఫీట్ల వరకు బఫ్ఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి. చెరువుల విస్తీర్ణం బట్టి చెరువు కట్టకు కనీసం 100 ఫీట్ల వరకు సెట్ బ్యాక్, బఫ్ఫర్ జోన్ పరిధిలోకి వస్తుంది. కాలువలను ఆనుకుని నిబంధనలు పాటించకుండా లే అవుట్‌లు చేసినా చర్యలు తీసుకుంటాం. బఫ్ఫర్ జోన్‌కు సంబంధించిన కమిటీ ఆధ్వర్యంలో నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అలా పాటించని వారిపై చర్యలకు సిఫారసు చేస్తాం.

–జగదీష్ డీఈ ఇరిగేషన్, బాన్సువాడ

క్లుప్తంగా

పెరిగిన విద్యుత్ చార్జీలతో తీవ్ర భారం



మద్నూర్(జుక్కల్): తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఎల్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్యవార్ నాగేశ్ విమర్శించారు. విద్యుత్ చార్జీలతో పాటు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని కోరుతు సోమవారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పగటి పూట 12 గంటల నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించాలన్నారు. ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకొని, వసూలు చేసినవి వినియోగదారుడి ఖాతాలో జమచేయాలన్నారు. ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 30 పైసలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

భిక్కనూరు: అయ్యవారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీవో ప్రవీణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలను సంధించి వారి నుంచి జవాబులను రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పాఠశాలలో బోధన జరుగుతుందని, హెచ్ఎం బోండుగుల శ్రీనివాస్‌ను అభినందించారు. భోజనం కూడా నాణ్యంగా ఉందని గుర్తించి ఏజెన్సీ వారిని కూడా అభినందించారు.

టీవీ, కూలర్ వితరణ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి గ్రామ అంగన్వాడి సెంటర్‌కు టీవీ, వాటర్ కూలర్, రంగులను సోమవారం బాన్సువాడ పట్టణంలోని ఎస్‌బీఐ మేనేజర్ పూర్ణ దయాళ్ అందించారు. వీటి ఖరీదు రూ.1 లక్షా పది వేలు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్, నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

అర కిలో వెండి అందజేత

బాన్సువాడ టౌన్: పట్టణంలోని పాత బాన్సువాడ హనుమాన్ ఆలయంలోని విగ్రహానికి వెండి తొడుగుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆయన అల్లుడు భాస్కర్ రెడ్డిలు అరకిలో వెండిని అందజేశారు. విగ్రహానికి వెండి తొడుగుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉమా మహేష్ , సభ్యులు జీడిపల్లి శ్రీకాంత్‌గౌడ్, మామిడి భూమేష్, దాసరి నాగరాజు ఉన్నారు.

బీమా ప్రొసీడింగ్ కాపీ..



పిట్లం(జుక్కల్): అన్నారం గ్రామ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారుడికి రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని మండల బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిల్లర్గి గ్రామానికి చెందిన బట్టు సాయిలు అనే రైతు ఇటీవల మృతి చెందడంతో ఆయనకు నామినీ అయిన బట్టు దత్తుకు 5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీను అందజేసినట్లు తెలిపారు. అనంతరం రైతు సమితి క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ కాశీరాం, ఎంపీటీసీ హన్మండ్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఫిజియోథెరపీతోనే అంగవైకల్యం నయం అవుతుందని దివ్యాంగుల ఉపాధ్యాయులు గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో భవిత సెంటర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఫిజియోథెరపి క్యాంప్ ఏర్పాటు చేశారు. దివ్యాంగ పిల్లలకు డాక్టర్ విశాలాక్షి ఆధ్వర్యంలో ఫిజియోథెరపి చేశారు. పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ

పిట్లం(జుక్కల్): పిట్లం ఎస్సైగా విజయ్ కొండ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పిట్లం ఎస్సైగా విధులు నిర్వహించిన రంజిత్ ఇటీవల మెదక్ జిల్లా రామాయణంపేట్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో ఆయన స్థానంలో పెద్దకొడపగల్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న విజయ్ కొండ వచ్చారు. సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.

వార్డు సభ్యుడి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండా 6వ వార్డు సభ్యుడు కొర్ర జగ్గరాం(65)అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. జగ్గరాం మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రిలో సోమవారం చికిత్స పొందుతూ ఆయన మృతిచెందాడని వారన్నారు. మెల్లకుంటతండాలో సోమవారం నిర్వహించిన జగ్గురాం అంత్యక్రియలకు సర్పంచ్ కేస్లీ, జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి హాజరై ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి: మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో డీఆర్‌డీవో సాయన్న నిర్వహించారు. 2020, నవంబర్ 1 నుంచి 2022, మార్చి 31 వరకు మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన రూ.14 కోట్ల 96 లక్షల ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణ, అవెన్యూ ప్లాంటేషన్ తదితర పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. పనులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. ఉపాధి హామీ పనులలో జరిగిన అవకతవకలకు సంబంధించి డబ్బులను రికవరీ చేస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, ఎంపీడీవో నారాయణ, ఎంపీవో ప్రకాష్ , సర్పంచులు, కార్యదర్శులు, తదితరులున్నారు.

నిధుల వివరాలు తెలియజేయండి



రాజంపేట: 2022-23 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేయాలని కోరుతూ సోమవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు రాము, నేతలు అవినాష్, శేఖర్ పాల్గొన్నారు.

‘ధనవంతులకు లబ్ధి చేకూరేలా చర్యలు’



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. పీఎం మోదీ సామాన్యులు దాచుకున్న పొదుపు డబ్బులను ధనవంతులకు లబ్ధిచేకూరేలా చర్యలను తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎల్ఐసీని ప్రైవేటు పరం చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హఫీజ్, వైస్ ఎంపీపీ నర్సింలు, నేతలు చిరంజీవులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాజంపేట: బీఆర్ఎస్‌తోనే తెలంగాణలో ఇటు అభివృద్ధితో అటు సంక్షేమం సాధ్యమవుతుందని, ఈ పథకాలతో దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా నిలిచిందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం బస్వన్నపల్లి గ్రామ యాదవ సంఘం భవనంలో సర్పంచ్ శ్రీజరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆర్గొండ, గుండారం, కొండాపూర్, శేర్ శంకర్ తండా, సిద్దాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాలలో తెలంగాణలో ఇస్తున్న సంక్షేమ పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. మతాల పేరుతో బీజేపీ నీచ రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. పువ్వు, చేయిలను చూసి ప్రజలు మోసపోవద్దని గుర్తుచేశారు. అలాగే బస్వన్నపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. జెడ్పీటీసీ కొండహన్మండ్లు, పీఏసీఎస్ చైర్మన్ కంది శివరాములు, ఎంపీటీసీ సుమలత, తదితరులున్నారు.

క్రీడా ప్రాంగణం ప్రారంభం



పల్లెబోగుడతండాలో ప్రారంభిస్తున్న నాయికులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లెబోగుడతండాలో సోమవారం క్రీడాప్రాంగణాన్ని ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, గ్రామసర్పంచ్ బద్దీ బాయి, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..తండాలోని యువకులు ప్రతిరోజూ క్రీడాప్రాంగణంలో ఆటలాడుతూ శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎంపీడీవో రఘు, పంచాయితీ కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

ప్రాంగణాన్ని వెంటనే పూర్తి చేయాలి

కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్, శాబ్దిపూర్ తండా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఎంపీడీవో శంకర్ నాయక్ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి గణేష్ ఉన్నారు.

రోడ్డును ధ్వంసం చేస్తే కఠిన చర్యలు



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మురళి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలోని బీటీ రోడ్డును ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని గ్రామ సర్పంచ్ మురళి హెచ్చరించారు. గోలిలింగాలలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో కొంతమంది రోడ్డును ధ్వంసం చేసి పైపులైన్లు వేశారని, ధ్వంసం చేసిన రోడ్డుపై సిమెంట్ వేయాలని, లేనిచో చర్యలు తప్పవన్నారు. దీంతోపాటు గ్రామంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు కోసం స్థల సేకరణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయితీ ద్వారా చేపట్టిన ఆర్థికపరమైన లావాదేవీల వివరాలను పంచాయితీ కార్యదర్శి మహేష్‌గౌడ్ చదివి వినిపించారు.

తమ భూమి ఇప్పించాలని ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన బాధితులు

లింగంపేట(ఎల్లారెడ్డి): కబ్జాకు గురైన సాగు భూమిని ఇప్పించాలని కోరుతూ సోమవారం లింగంపేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ పెద్దొళ్ల అంజయ్య తమ భూమి కబ్జా చేసినట్లు ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అదే గ్రామానికి చెందిన మూగూరి సాయవ్వ, శివరాములు, సాయిలు, సాయిబాబాలు ఫిర్యాదు చేశారు. సజ్జన్‌పల్లి శివారులోని సర్వే నెంబర్-843/7లో రెండు ఎకరాల వ్యవసాయ భూమి కబ్జా చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం గురించి వీఆర్ఏను ప్రశ్నించగా తాను ఎలాంటి భూమి కబ్జా చేయలేదని కావాలంటే విచారణ చేసుకోవాలన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



ముత్యంపేటలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ తిర్మల్



అయ్యపల్లిలో .. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి



పిట్లంలో.. సర్పంచ్ జొన్న విజయారెడ్డి



నాగిరెడ్డిపేటలో పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

పిట్లం/లింగంపేట/దోమకొండ/నాగిరెడ్డిపేట/భిక్కనూరు/రాజంపేట/నిజాంసాగర్/పెద్దకొడప్‌గల్: కంటి వెలుగు కార్యక్రమం సోమవారం పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభించారు. పిట్లం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జొన్న విజయా రెడ్డి, లింగంపేట మండలం అయ్యపల్లిలో ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, దోమకొండ మండలం ముత్యంపేటలో జెడ్పీటీసీ తిర్మల్ గౌడ్, రాజంపేట మండలం బస్వన్నపల్లిలో సర్పంచ్ శ్రీజారెడ్డి కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. నాగిరెడ్డిపేటలో ఎంపీడీవో రఘు, భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డిలో ఎంపీవో ప్రవీణ్ కుమార్ కంటి వెలుగు శిబిరాలను పరిశీలించారు. శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షలు చేసి కంటి అద్దాలు పంపిణీ చేశారు.

ఇంటింటి ప్రచారం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు కంటి వెలుగు కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వడమే కాకుండా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌వీర్, వైస్ ఎంపీపీ నర్సిములు, సర్పంచ్ సంజీవులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో స్పందన కరువు



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి స్పందన రావడం లేదని శిబిరం ఇన్‌చార్జి డాక్టర్ శ్వేత అన్నారు. క్యాంపు అంచనా 300 మంది ఉండగా సోమవారం కేవలం 114 మంది మాత్రమే పరీక్షలకు హాజరు అయ్యారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేసుకోవాలన్నారు. అలాగే నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమంలో 121 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 24 మందికి కంటి అద్దాలను అందించామని డాక్టర్ వైశాలి తెలిపారు.

‘రజకులపై చిన్న చూపు’

కామారెడ్డి రూరల్: తెలంగాణలో రజకులపై బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర యూత్ కార్యదర్శి దేవరి నందు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని బడ్జెట్‌లలో రజకులకు ఒకసారి రూ.250 కోట్లు, ఇంకోసారి రూ.200 కోట్లు, మరోసారి రూ.24 కోట్లు కేటాయించి, నిధులు విడుదల చేయకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతూ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వెంటనే బడ్జెట్ సమావేశాలలో గత బడ్జెట్లో కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసి.. రాబోయే బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, అచ్చంపేట, మల్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లల్లో మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ తెలిపారు.

9న నెమ్లికి పాదయాత్ర

మద్నూర్(జుక్కల్): మద్నూర్ నుంచి నెమ్లి సాయిబాబా ఆలయానికి ఈ నెల 9న పాదయాత్ర చేస్తున్నట్లు మద్నూర్ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు బోశివార్ ప్రకాశ్ తెలిపారు. ప్రతి యేడు సాయిబాబా ఆలయానికి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోందని ఆయన చెప్పారు.

ఆధ్యాత్మికం

వైభవంగా రథోత్సవం



సదాశివ నగర్(ఎల్లారెడ్డి): కల్వరాల్‌లో శ్రీ కృష్ణుని జాతరలో భాగంగా నిర్వహించిన రథోత్సవం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా భక్తులు గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలను ఆలపించారు. భక్తులకు భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మమత, ఉప సర్పంచ్ శివరాం పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ పండుగ

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య, కార్మికులు పాల్గొన్నారు.

దేవునిపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావుల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. మహారాజపోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతి యాదవ్, పాత రాజులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: పట్టణంలోని గంగామాత ఆలయ 21వ వార్షికోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలో సోమవారం గంగమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. పెద్ద చెరువు వద్ద ఆలయంలో అమ్మవారికి బోనాలను సమర్పించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. శివగంగా కల్యాణోత్సవం, సామూహిక కుంకుమార్చన, తెప్పోత్సవం పూజలను ఘనంగా చేశారు. సాయంత్రం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. గంగపుత్ర సంఘం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం 47వ వార్షికోత్సవం 3 రోజులుగా ఘనంగా కొనసాగుతోంది. సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. భాజాభజంత్రీలతో మండల కేంద్రంలో బోనాల ర్యాలీ నిర్వహించారు.

సంక్షిప్తం

కార్మికులు ఐక్యంగా ఉండాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కార్మికులు ఐక్యంగా ఉండాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం వ్యవస్థాపకులు కామల ఐలయ్య అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. సాయిబాబా, మోయినోద్దిన్, లక్ష్మణ్, శ్యాం ఉన్నారు.

బోరుబావుల తవ్వకానికి శ్రీకారం

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట, ఆరేడ్ గ్రామ పంచాయతీల్లో సోమవారం బోరు బావుల తవ్వకానికి బీఆర్ఎస్ నాయకులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ నిధులతో బోరుబావులు తవ్విస్తున్నారు. నాయకులు సత్యనారాయణ, రమేష్‌కుమార్, నారాయణ ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి అనిల్ సూచించారు. సోమవార్మ మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్య సిబ్బంది భీం, శ్రీహరి, దోమల శ్రీధర్, లింబమ్మ, పాల్గొన్నారు.


ముదిరాజ్‌ల సొసైటీని ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డి: ముదిరాజ్‌ల సొసైటీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ ముదిరాజ్ సంఘం నాయకులు గోనే శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ శివారులోని మల్లారెడ్డి చెరువులో చేపలు పట్టేందుకు సొసైటీని ఏర్పాటు చేయాలని వారు విన్నవించారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

భిక్కనూరు: స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. 16 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎంపీపీ గాలిరెడ్డి ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, మార్కెట్‌కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ బోడ నరేష, ఎంపీటీసీలు సువర్ణ, చంద్రకళలు పాల్గొన్నారు.

పద్మశాలి యువజన కమిటీ ఎన్నిక



కామారెడ్డి టౌన్: పట్టణ పద్మశాలి యువజన సంఘం నూతన కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా క్యాతం సిద్దరాములు వ్యవహరించి నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఐరేని సందీప్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెలిమల భాను ప్రసాద్, ఇప్పకాయల రాజు, జిల్లా అధ్యక్షుడిగా పొలాస సురేష్, ప్రధాన కార్యదర్శిగా సామల నాగశ్రీను, కోశాధికారిగా సబ్బని మదన్, ఉపాధ్యక్షులుగా చాట్ల వేణు, జడల రజనీకాంత్, గాజుల నరేష్, బొమ్మెర సాయినాథ్, బొమ్మెర వేణు గోపాల్, తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ కో-కన్వీనర్‌గా గర్దాస్ గోవర్ధన్, తదితరులున్నారు.